నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I హైదరాబాద్, ఆదివారం 17 నవంబర్ 2024 HYDERABAD



## వీధి కుక్కల దాడి.. చిన్నారికి తీవ్ర గాయాలు

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 16: వీధి కుక్కల దాడిలో ఓ ఐదేండ్ల చిన్నారి తీవ్రంగా గాయపడింది. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధి పద్మశాలిపురానికి చెందిన రఫీ, హైసా దంపతుల కూతురు గులాబ్షా పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి ఆడుకునేందుకు బయటకు వచ్చింది. ఇంటి ముందు ఆడుకుంటుండగా, వీధి కుక్కల గుంపు ఒక్కసారిగా దాడి చేశాయి. చిన్నారి గట్టిగా కేసులు వేయడంతో స్థానికులు కుక్కలను తరిమికొట్టారు. తీవ్రంగా గాయపడిన గులాబ్షాను కుటుంబసభ్యులు వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించారు.

## గిరిజనుల భూములు లాక్కుంటే ఊరుకునేది లేదు

**బీఆర్ఎస్ సీనియర్ నేత కేతావత్ రాముడాయక్**



శంషాబాద్ రూరల్, నవంబర్ 16 : గిరిజనులపై అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని బీఆర్ఎస్ సీనియర్ నేత కేతావత్ రామునాయక్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డికి పాలన చేతగాక ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తప్పుదోవ పట్టించడం కోసం తెలంగాణ వ్యాప్తంగా భూములు లాక్కోవాలని చూస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతినిత్యం వహిస్తున్న కొడంగల్‌లో అల్లుడి కంపెనీల కోసం అమాయకులైన గిరిజనులకు జీవనాధారమైన భూములను లాక్కునేందుకు చూస్తే ఊరుకునే ప్రసక్తేలేదన్నారు. గిరిజనులపై అమానుషంగా దాడి చేసిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.





శనివారం తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

# బీఆర్ఎస్‌కు జై కొట్టి.. గులాబీ కండువా కప్పుకొని..

- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో భారీగా చేరికలు
- గులాబీ కండువా కప్పుకున్న కాంగ్రెస్ నాయకులతో పాటు 350 మంది నేతలు, కార్యకర్తలు
- నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతా: కార్తీక్‌రెడ్డి

మణికొండ, నవంబర్ 16: రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి నేతృత్వంలో శనివారం నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్యాద్రినాయుడు, భాస్కర్‌గౌడ్, షేక్ ఆరీఫ్, వెంకటేశ్‌తో పాటు 350 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో శనివారం తెలంగాణభవన్‌లో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ 'రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి అతిపెద్ద మెజార్టీతో రెండుసార్లు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ను గెలిపించాం. ఎవరూ సొంత శక్తితో గెలిచిన వారే కాదు.. కేసీఆర్ వంటి శక్తి వెనుకాల ఉండకపోతే కేవలం వార్డు మెంబర్‌గా కూడా వారు గెలవకపోతుండే. నియోజకవర్గ ప్రజలకు ఏం చెప్పి పార్టీ మారారో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఇప్పటికీ స్పష్టంగా ప్రజలకు చెప్పలేద'న్నారు. నాలుగేండ్ల అధికారం ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనకు పనికిరాదని ముందే గుర్తించి.. బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు వచ్చిన నాయకులందరికీ భవిష్యత్‌లోనూ సముచితమైన స్థానం, గౌరవాన్ని అందిస్తామని కార్తీక్‌రెడ్డి స్పష్టం చేశారు. పదేండ్లు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను చూస్తుంటే తనకు బాధేస్తున్నదని, వారంతా జెండా కూలీలుగా మారారని, వారిని చూస్తే జాలేస్తున్నదని కార్తీక్‌రెడ్డి అన్నారు. కనీసం కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకోని వారు సైతం నామినేటెడ్ పదవులు తీసుకుంటున్నారని గుర్తుచేశారు.

**ఐదు సీట్లు కూడా..**

ఇప్పటికిప్పుడు రాష్ట్రంలో ఎన్నికలు పెడితే కాంగ్రెస్ పార్టీకి ఐదు సీట్లు కూడా సరిగ్గా రావని కార్తీక్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, కీర్తీలతాగౌడ్, రూపారెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 60% ఆస్తులపై పీటముడి

**ఓల్డ్ సిటీ మెట్రోకు 200 ఆస్తుల సేకరణకు మొదలైన కసరత్తు**

సిటీబ్యూరో: ఏడున్నర కిలోమీటర్ల మేర ఓల్డ్ సిటీ మెట్రో నిర్మాణం కీలక దశకు చేరుకున్నది. ప్రాజెక్టు నిర్మాణంలో ముఖ్యమైన భూసేకరణకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. అయితే ఇప్పటికే గుర్తించిన ఆస్తుల్లో 60 శాతం ఆస్తుల సేకరణపై పీటముడి పడింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న 200 ఆస్తులను నోటిఫై చేస్తూ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో... మిగిలిన 400 ఆస్తుల సేకరణ తలకు మించిన భారంగా మారనున్నది.

**తొలి దశలో 200 ఆస్తులకు..**

ఓల్డ్ సిటీ మెట్రో రైల్ భూసేకరణకు పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే మెట్రో అధికారులు భూసేకరణ నోటీసులు జారీ చేసేవారు. రోడ్డుకు ఇరువైపులా తొలి దశలో 200 ఆస్తులకు సంబంధించి డిక్లరేషన్ తీసుకునేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించగా... ప్రాజెక్టుకు అవసరమైన భూముల సేకరణ ప్రక్రియను చేపట్టనున్నారు. అయితే రోడ్డు విస్తరణ వల్ల మొత్తం 1000కి పైగా ఆస్తులు నష్టపోతున్నాయని భూసేకరణ అధికారులు ఇప్పటికే గుర్తించారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ఇప్పటివరకు గుర్తించిన మార్గంలో 21 మసీదులు, 12 దేవాలయాలు, 55 దర్గాలు, అషూర్ఖానాలతోపాటు, 13 శ్మశాన, చిల్లాలతోపాటుగా, 100కుపైగా మతపరమైన నిర్మాణాలను గుర్తించినట్లు హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు.



వీటిని సేకరించేందుకు ఇప్పటికే పలు దఫాలుగా సంప్రదింపులు జరిపినా... భూసేకరణ ప్రక్రియపై స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తం అవుతూనే ఉన్నది. మెట్రో వెళ్లే మార్గాన్ని 100 ఫీట్లకు మెట్రో స్టేషన్లు వచ్చే ప్రాంతాన్ని 120 ఫీట్లకు విస్తరించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం దారుల్‌షిఫా నుంచి శాలిబండ జంక్షన్ వరకు 50-60 అడుగుల వెడల్పుతో, శాలిబండ జంక్షన్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 80 ఫీట్ల రోడ్డు అందుబాటులో ఉంది. దీంతో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు సగటున 30-40 ఫీట్ల మేర రోడ్లను విస్తరించాల్సి ఉండటంతో భూసేకరణ ప్రక్రియ చిక్కు ప్రశ్నగా మారింది. రోడ్డుకు ఇరువైపులా 200 ఆస్తులను నోటిఫై చేస్తూ జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. కానీ మిగిలిన 400 ఆస్తులను ఎలా సేకరించాలనేది అధికారులకు ఇప్పుడు అంతు చిక్కని ప్రశ్నగా మారింది.



## గ్రేటర్ @ 32.0

సిటీబ్యూరో, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి మించి నమోదవుతుండడంతో ఉక్కపోత తప్పడం లేదు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 32.0, కనిష్ఠం 20.4 డిగ్రీలు గాలిలో తేమ 41శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.




## ఏటీఎంలో చోరీకి యత్నం

బంజారాహిల్స్, నవంబర్ 16: జైల్లో ఉన్న తమ స్నేహితుల ములాఖత్ కోసం వచ్చిన ఇద్దరు వ్యక్తులు నేరానికి పాల్పడ్డారు. ఓ ఏటీఎంలో చోరీకి యత్నించారు. ఈ ఘటనలో ఒకరిని పోలీసులు పట్టుకోగా, మరొకరు పరారయ్యాడు. అతన్ని విచారించిన పోలీసులకు షాకింగ్ విషయాలు తెలిశాయి. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనగర్ కాలనీలోని ఏటీఎం చౌరస్తాలో ఉన్న కోటక్ మహేంద్ర బ్యాంక్‌కు చెందిన ఏటీఎంలోకి శుక్రవారం రాత్రి 10.40గంటల ప్రాంతంలో ఇద్దరు దుండగులు ప్రవేశించారు. ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేయడంతో పాటు డబ్బులు తీసుకునేందుకు యత్నిస్తున్న విషయాన్ని సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన బ్యాంక్ సెక్యూరిటీ విభాగం స్థానికంగా ఉన్న సంస్థ ప్రతినిధి ముఖేశ్‌కు సమాచారం అందించింది. దీంతో అక్కడకు చేరుకోగానే ఇద్దరు దుండగులు పారిపోయారు. ఈ మేరకు ముఖేశ్ అర్ధరాత్రి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. వారిలో ఓ నిందితుడిని పట్టుకొని విచారించగా, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన పాత నేరస్తులు పరియేజ్ (32), అరవింద్ బోలా (30)గా గుర్తించారు. గంజాయి కేసుల పట్టుబడి చంచల్‌గూడ జైలులో ఉన్న వారి స్నేహితులు సలీం, సక్లెయిన్‌ను ములాఖత్‌లో కలిసేందుకు వచ్చి నగరంలోని ఏటీఎంలలో చోరీ చేసి యూపీకి పారిపోవాలని ప్రణాళిక వేసుకున్నట్లు వెల్లడైంది.



శనివారం సచివాలయంలో అగ్నిమాపక శాఖ మాక్ డ్రిల్ నిర్వహించింది. అగ్ని ప్రమాద నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అక్కడి ఎస్పీఎఫ్ సిబ్బందికి అధికారులు అవగాహన కల్పించారు.

## ఫ్రిడ్జ్ పేలి.. సిలిండర్‌కు మంటలంటుకొని.. అపార్ట్‌మెంట్‌లో భారీ అగ్ని ప్రమాదం



మణికొండ: ఓ అపార్ట్‌మెంట్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడ గోల్డెన్ ఓరియల్ అపార్ట్‌మెంట్‌లోని బీ బ్లాక్ 310 ఫ్లాట్‌లో శనివారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇంట్లోని ఫ్రిడ్జ్ పేలడంతో ఆ మంటలన్నీ వంటగదిలోని సిలిండర్‌కు అంటుకుని మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోని వారంతా ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బయటకు పరుగులు తీశారు. దాదాపు రూ. 50 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు యజమాని వెంకట్ తెలిపారు. కాగా, అపార్ట్‌మెంట్‌లో ఎగిసిపడుతున్న మంటలను ఆర్పివేసేందుకు నాలుగు ఫైరింజన్లు వచ్చినా.. అవి వెళ్లేందుకు సరిగ్గా దారి లేకపోవడంతో గంట పాటు నిరీక్షణ తప్పలేదు. ఈ క్రమంలో వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. వాహనాలు తిరిగే ప్రాంతంలో గార్డెన్ ఏర్పాటు చేసుకొని.. మొక్కలు నాటడంతో ఫైరింజన్లు రావడానికి అన్నీ అడ్డంకులే కనిపించాయి. అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు.

## పార్ట్‌టైమ్ పేరుతో కుచ్చుటోపి

**రూ. 1.61 కోట్లు వసూలు.. ఇద్దరు సైబర్ నేరస్తుల అరెస్ట్**



సిటీబ్యూరో, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): పార్ట్‌టైమ్ జాబ్స్ పేరుతో నిరుద్యోగుల వద్ద నుంచి రూ.1.61 కోట్లు వసూలు చేసి మోసగించిన ఇద్దరు సైబర్ నేరస్తులను నగర సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సైబర్‌క్రైమ్ డీసీపీ ధార కవిత కథనం ప్రకారం...మహారాష్ట్రకు చెందిన శ్రీకృష్ణ బాబన్‌రావు పవార్(43), రమాకాంత్ జీవన్ ధనావత్(30) అమాయకులైన నిరుద్యోగులు, మహిళలను లక్ష్యంగా చేసుకుని పార్ట్‌టైమ్ జాబ్స్ పేరుతో టెలీగ్రామ్స్, వాట్సాప్ తదితర సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా మెసేజ్‌లు పంపుతారు. ఈ క్రమంలోనే నగరానికి చెందిన ఓ వ్యక్తికి ఇటీవల టెలీగ్రామ్ మెసేజ్ ద్వారా పార్ట్‌టైమ్ జాబ్ ఆఫర్ వచ్చింది. సదరు వ్యక్తి సందేశంలో ఉన్న సూచనల మేరకు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ క్రియేట్ చేసి, రిజిస్టర్ అయ్యాడు. అయితే తమ కంపెనీలో చిన్నమొత్తంలో పెట్టుబడి పెడితే.. వెంటనే రాబడి ఉంటుందని నిందితులు చెప్పడంతో అది నమ్మిన బాధితుడు.. మొదట చిన్నమొత్తంలో పెట్టుబడి పెట్టగా, దానికి వెంటనే రాబడి వచ్చింది. దీంతో నమ్మకం పెరిగిన బాధితుడు అధిక పెట్టుబడి పెట్టడంతో కొన్ని రోజులు రాబడి వచ్చింది. ఈ క్రమంలో బాధితుడు రూ.1.61 కోట్లు వరకు పెట్టుబడి పెట్టడంతో బాధితుడికి రాబడి రూపంలో వచ్చిన డబ్బులు వెబ్‌సైట్‌లో చూపించాయి. కానీ వాటిని విత్‌డ్రా చేసుకునే వీలు లేకపోవడంతో అనుమానం వచ్చిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న నగర సైబర్‌క్రైమ్ పోలీసులు నిందితులను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పెట్టుబడుల పేరుతో అధిక రాబడి ఆశచూపే నకిలీ సంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దురాశకు వెళ్లి మోసపోవద్దని డీసీపీ కవిత ప్రజలకు సూచించారు.

# నిర్వీర్యం చేసి.. నిధుల వేట!

**కేసీఆర్ ప్రభుత్వ హయాంలో..**

హెచ్ఎండీఏ ప్రణాళికా విభాగం నుంచి ప్రతి నెలా రూ.100-110 కోట్ల ఆదాయం. ఒక్కో నెల రూ.200 కోట్ల వరకు కూడా ఆదాయం వచ్చేది. ఇలా ఏటా సుమారు రూ.12-24వేల కోట్ల వరకు ఆదాయం సమకూరేది. అందుకే ప్రతి సంవత్సరం గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు హెచ్ఎండీఏ పరిధిలో రూ.2000-2500 కోట్ల వరకు అభివృద్ధి పనులకు ఆ సంస్థ నిధులను వెచ్చించేది. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో జరిగిన భూముల వేలంలో ఎకరా రూ.100 కోట్లు పలికిన చరిత్ర నమోదైంది.

**రేవంత్ పాలనలో..**

పదకొండు నెలలుగా హెచ్ఎండీఏ ఆదాయం గణనీయంగా పడిపోయింది. నెలకు రూ.50 కోట్ల కంటే తక్కువ ఆదాయం వస్తున్నది. వచ్చే నిధులు నిర్వహణ, ఇతరత్రా వాటికే సరిపోతున్నది. దీంతో హెచ్ఎండీఏ పరిధిలో ఒక్క అభివృద్ధి పనికి నిధులు వెచ్చించే పరిస్థితి లేదు. పదకొండు నెలలుగా ఒక్కటంటే ఒక్క కొత్త ప్రాజెక్టు పురుడుపోసుకున్న దాఖలాలు లేవు. చివరకు సికింద్రాబాద్-కంటోన్మెంట్ పరిధిలో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాల కోసం నిధులు లేక అధికారులు దిక్కులు చూస్తున్నారు. ఈ ప్రాజెక్టును ఎలా చేపట్టాలి? నిధులు ఎక్కడి నుంచి తేవాలి? కాస్త దారి చూపండంటూ ప్రైవేటు కన్సల్టెంట్లను ఎంపిక కోసం అధికారులు అన్వేషణ చేపట్టారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా రియల్ రంగం ఢమాల్ అనడంతో సెంటు భూమిని వేలం వేయాలన్నా అధికారులు జంకుతున్న పరిస్థితి. ఇదీ... హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) దుస్థితి.

- కాంగ్రెస్ పాలనలో హెచ్ఎండీఏ ఖజానా కుదేలు
- నిధులు లేక సందిగ్ధంలోపడిన ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం
- ఏం చెయ్యాలో చెప్పండంటూ.. కన్సల్టెంట్ల కోసం అన్వేషణ
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏటా రూ.2వేల కోట్ల అభివృద్ధి పనులు చేసిన హెచ్ఎండీఏ




సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): పదకొండు నెలల రేవంత్ సర్కారు హయాంలో హెచ్ఎండీఏ ఖజానా కుదేలవ్వడంతో పాటు ప్రైవేటు వ్యక్తుల ప్రమేయంతో ఆయువుపట్టులాంటి ప్రణాళిక విభాగం నిర్వీర్యమైంది. దీంతో ఆ ప్రభావం అభివృద్ధి పనులపై పడింది. పదకొండు నెలల్లో ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పనిని చేపట్టలేకపోయిన హెచ్ఎండీఏ... చివరకు కీలకమైన ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి నిధులు లేక దిక్కులు చూస్తున్నది. ఒకవైపు ప్రభుత్వం నుంచి నిధులు రాక... మరోవైపు ఖజానాలో కాసులు లేక... ప్రాజెక్టు కించిత్తు కూడా ముందుకు కదలడం లేదు. దీంతో పాటు రక్షణ శాఖ భూములకు బదులుగా 676 ఎకరాల రాష్ట్ర ప్రభుత్వ భూముల్ని కేంద్రానికి బదలాయించాల్సి ఉండగా... ఒకేచోట ఇంత విస్తీర్ణం కావాలనే రక్షణ శాఖ షరతుతో భూ బదాలాయింపు ప్రక్రియ కూడా ముందుకు సాగడం లేదు.

**తొమ్మిది నెలల కిందట శంకుస్థాపన..**

ఉత్తర తెలంగాణకు వెళ్లే వారితో పాటు సికింద్రాబాద్-కంటోన్మెంట్-మల్కాజిగిరి-మేడ్చల్ ప్రాంతాల్లోని వాహనదారుల ట్రాఫిక్ ఇక్కట్లను తీర్చేందుకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణ ప్రాజెక్టును రూపొందించారు. ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫాం వరకు సుమారు ఐదు కిలోమీటర్లు, జేబీఎస్ నుంచి తూంకుంట వరకు దాదాపు 13 కిలోమీటర్లు... ఇలా రెండు మార్గాల్లో సుమారు 18 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి భూసేకరణ సహా రూ.ఏడు వేల కోట్ల వరకు ఖర్చవుతుందని గతంలోనే అంచనా వేశారు. ఈ మేరకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక కూడా సిద్ధం చేశారు. కానీ కేంద్రం సహకరించకుండా రక్షణ శాఖ భూములు ఇవ్వకపోవడంతో ప్రాజెక్టు ముందుకు సాగలేదు. అయితే కాంగ్రెస్ సర్కారు వచ్చిన నెల రోజుల వ్యవధిలోనే కేంద్రం నుంచి అనుమతి వచ్చింది. దీంతో గత ఫిబ్రవరిలో సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన కూడా చేశారు. కానీ ఇప్పటివరకు ప్రాజెక్టులో కించిత్తు పురోగతి లేదు. చివరకు కేంద్రం నుంచి అనుమతి వచ్చిన దరిమిలా కనీసం భూ బదలాయింపు ప్రక్రియను కూడా పూర్తి చేయలేకపోయారు. గత తొమ్మిది నెలలుగా హెచ్ఎండీఏ నిధులు లేక కన్సల్టెంట్ల వేటలో పడిపోయింది. మొదటిసారి స్పందన రాకపోవడంతో రెండోసారి కూడా టెండర్లు పిలిచారు. కానీ ఇప్పటివరకు కన్సల్టెంట్ల ఎంపిక పూర్తి కాలేదు.

**కన్సల్టెంట్ చెబితేగానీ చేయలేని దౌర్భాగ్యం..**

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హెచ్ఎండీఏ ప్రణాళిక విభాగం నుంచి నెలకు రూ110-200 కోట్ల వరకు ఆదాయం వచ్చేది. మరోవైపు రియల్ రంగం కూడా మంచి జోరు మీద ఉండటంతో హెచ్ఎండీఏ చేపట్టిన వేలం ప్రక్రియలన్నీ రికార్డులు నమోదు చేసి వేల కోట్ల ఆదాయం సమకూరింది. దీంతో రేడియల్ రోడ్లు, లింకు రోడ్లు, థీమ్ పార్కులు, పచ్చదనం పెంపు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలను హెచ్ఎండీఏ చేపట్టేది. ఏటా రూ.2వేల కోట్ల వరకు పనులు పూర్తి చేసేది.

**ప్రణాళిక విభాగం నిర్వీర్యం..**

కాంగ్రెస్ పాలనలో ప్రణాళిక విభాగం పూర్తిస్థాయిలో నిర్వీర్యమైంది. బహుళ అంతస్తుల నిర్మాణ అనుమతులు, భూ వినియోగ మార్పు అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులు గుట్టల్లా పేరుకుపోతున్నాయి. షాడో నేతల నీడలో హెచ్ఎండీఏ విలవిలలాడుతున్నది. ఆ ముగ్గురు గ్రీన్‌సిగ్నల్ ఇస్తేగానీ అధికారులు అనుమతులు ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో ప్రణాళిక విభాగం ఆదాయం ఇప్పుడు రూ.50 కోట్ల కంటే తక్కువకు పడిపోయింది. ఈ ఆదాయం నెలవారీ జీతభత్యాలు, నిర్వహణకే సరిపోతుండటంతో అభివృద్ధి పనులకు చిల్లిగవ్వ ఖర్చు చేయలేని స్థితిలో హెచ్ఎండీఏ చిక్కుకుపోయింది. ఈ నేపథ్యంలో ఎలివేటెడ్ కారిడార్ల ప్రాజెక్టును పబ్లిక్-ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో చేపట్టాలా? లేదా బిల్డ్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌పర్ (బీవోటీ) విధానంలో చేపట్టాలా? కాస్త సలహాలివ్వండి అంటూ కన్సల్టెంట్ల నివేదిక కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. ఆ కన్సల్టెంట్ ఎంపిక కోసమే ఇప్పుడు టెండర్లను పిలిచారు. హెచ్ఎండీఏ గతంలో అధికార యంత్రాంగమే పూర్తిస్థాయిలో ప్రాజెక్టులు డిజైన్ చేసి, పర్యవేక్షణ చేసి, పూర్తి చేసే స్థితి నుంచి ఇప్పుడు ప్రైవేటు కన్సల్టెంట్లు ఎలా చెబితే అలా చేయాలనే దుస్థితికి చేరింది.